క్లుప్తంగా

రేపు టీ-20 క్రికెట్ జట్లు ఎంపిక

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల మైదానంలో గురువారం ఉదయం 10 గంటలకు టీ-20 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ జట్లు ఎంపిక చేయనున్నట్లు ప్రిన్సిపాల్ బ్రహ్మాజీ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్ 16, అండర్ 19 జట్లు ఎంపిక జరుగుతుందని ఆసక్తిగల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8309365583, 9701515415 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

4న ఉచిత కంటి వైద్య శిబిరం

వాల్మీకిపురం: శ్రీ షిరిడి సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా మొదటి గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, షిరిడి సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ నెల 4న స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఆవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బోయపల్లిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గాలపై కేసు

వాల్మీకిపురం: మండలంలోని చింతలవారిపల్లి పంచాయతీ బోయపల్లిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గాల మధ్య గత రెండు రోజుల నుంచి ఘర్షణ వాతావరణం చోటు చేసుకొంది. ఇటు వైఎస్సార్‌సీపీ, అటు టీడీపీ మధ్య వర్గపోరు సాగుతోంది. ఇరు వర్గాల ఘర్షణలో మహిళలు కూడా ఉండడం గమనార్హం. మంగళవారం వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోగా.. సంఘటనకు సంబంధించి ఎస్ఐ నాగేశ్వర రావు ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందని, దీంతో కొంత మంది గాయపడ్డారని తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పేదల ఆకలి తీర్చడానికి ఫుడ్‌బ్యాంకు



ఫుడ్‌బ్యాంకు వద్ద హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: అన్నార్తుల ఆకలి తీర్చడానికి ఫుడ్ బ్యాంకు ఏర్పాటు చేశామని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులోని ఫుడ్ బ్యాంకులో వివాహ వార్షికోత్సవం పురస్కరించుకుని అన్నం పొట్లాలను బ్యాంకులో ఏర్పాటు చేశారు. ఎంతో మంది నిరాశ్రయులు బస్టాండు ప్రాంతాల్లో ఉన్నారని, వీరికి ఆకలి తీర్చడానికి ఫుడ్ బ్యాంకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు కిరణ్, పవన్, అర్షాద్, సిరాజ్, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ బార్గవ్‌రెడ్డి, సిబ్బంది ఉమశంకర్, ముంజుల పాల్గొన్నారు.

ఆండ్రాయిడ్ ఫోన్లతో బహుళ ప్రయోజనాలు



ఆండ్రాయిడ్ ఫోన్లపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పీలేరు రూరల్ : ఆండ్రాయిడ్ ఫోన్లతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని పాకాల వేము ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అన్నారు. మంగళవారం పీలేరు పట్టణంలో విద్యార్థులు కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్ట్‌లో భాగంగా ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆండ్రాయిడ్ పోన్లు ఎంత వాడాలి, ఎంత వరకు నిర్మూలించాలో తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు సుదర్శన్, నవీన్, కిషోర్, శివప్రసాద్, ప్రదీప్‌కుమార్, జగదీష్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత



హెచ్‌ఎంలకు యూనిఫాం అందజేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఎంఈఓ నారాయణ, ఎంఈఓ-టూ గౌస్‌పీర్‌లు యూనిఫాం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో విద్యార్థికి మూడు జతల చొప్పున మండలంలో 3,240 మందికి యూనిఫాం మంజూరు కాగా వాటిని ఆయా పాఠశాల హెచ్‌ఎంలకు అదజేశామన్నారు.

వాహనాల తనిఖీ

సుండుపల్లె : మండల పరిధిలోని బైరాగుట్ట దగ్గర ఎస్ఐ హుస్సేన్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులతో ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. హెల్మెట్ తప్పక ధరించాలన్నారు.

హార్సిలీహిల్స్‌పై అంధకారం

- వెలగని హైమాస్ లైట్లు
- రూ.14.75 లక్షల ఖర్చు చేసినా ఫలితం శూన్యం
- చీకట్లోనే సందర్శకులు, స్థానికులు సంచరించాల్సిన పరిస్థితి



హార్సిలీహిల్స్‌పై నెలకొన్న అంధకారం

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ కొన్ని నెలలుగా అంధకారంలో మగ్గిపోతోంది. పట్టించుకోవాల్సిన అధికారుల నిర్లక్ష్యంతో రూ.14.75 లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లు నిరుపయోగమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు, స్థానికులు అంధకారంలోనే సంచరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిరుతలు, వన్యప్రాణులకు నిలయమైన హార్సిలీహిల్స్‌పై చీకట్లు అలుముకోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హార్సిలీహిల్స్ చుట్టూ దట్టమైన అడవితో ఉంటుంది. కొండపై చుట్టూ ఒక రహదారి, జిడ్డు సర్కిల్ నుంచి రెవెన్యూ అతిథి గృహం వరకు ఒక రహదారి, స్విమ్మింగ్‌పూల్ నుంచి గవర్నర్‌బంగ్లా వరకు ఒక రహదారి ఉంటుంది. మొత్తం మూడు రోడ్లు మాత్రమే ఉండగా, కాలినడక ఇళ్లకు, అతిథి గృహాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కొండ నివాస, జన సంచార ప్రాంత విస్తీర్ణం మొత్తం 103 ఎకరాలే. మిగతాదంతా అటవీశాఖ పరిధిలోని అడవులే. ఈ కొద్దిపాటి విస్తీర్ణంలోని ప్రాంతాన్ని పట్టించుకునే పరిస్థితి లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. హార్సిలీహిల్స్ పాలన, పర్యవేక్షణ మదనపల్లె ఆర్డీఓ పరిధిలో ఉంటుంది. హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీకి ఆయనే చైర్మన్. ఇక్కడి సమస్యలపై సమీక్ష, పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుత సమస్య హైమాస్ లైట్లు వెలగక నిరుపయోగంతో అంధకారం నెలకొంది. గత ఆర్డీఓ ఎంఎస్.మురళి కొండపై వీధి దీపాల స్థానంలో హైమాస్ లైట్లు వేయించేందుకు టెండర్లు నిర్వహించి రూ.14.75 లక్షలతో ఐదు చోట్ల వాటిని ఏర్పాటు చేయించారు. వీటిలో జిడ్డు సర్కిల్‌లో ఒకటి మినహా నాలుగు హైమాస్ లైట్లు పూర్తిగా వెలగడం లేదు. చీకటి కారణంగా వన్యప్రాణులు, చిరుతలు కొండపైకి వస్తే ప్రమాదమని పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై టౌన్‌షిప్ కమిటి సత్వమే చర్యలు చేపట్టి అంధకారం నుంచి హార్సిలీహిల్స్‌కు విముక్తి కలిగించి వెలుగులు విరజిమ్మేలా చూడాలని పర్యాటకులు కోరుతున్నారు.

డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా మలేరియా నివారణాధికారి వేణుగోపాల్

గుర్రంకొండ: డెంగీ జ్వరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక ఉర్దూ జెడ్పీహైస్కూల్, కంద్రిగ గ్రామాల్లో డెంగీ, డయేరియాపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు కుట్టకుండా తగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా దోమలను లార్వాదశలోనే గుర్తించి నిర్మూలించాలన్నారు. లార్వా పెరిగే నీటిని నిలువలేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలన్నారు. తద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందన్నారు. దోమలు కుట్టకుండా సాయంకాలం వేల ఇళ్లలో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. రాత్రిళ్లు దోమతెరలు కట్టుకొని నిద్రించడం శ్రేయస్కరమన్నారు. డయేరియా(అతిసారా)వ్యాధి ప్రబలకుండా ప్రతి ఒక్కరు చేతులను పరిశుభ్రంగా శుభ్రం చేసుకోవాలన్నారు. ఆహార పదార్థాలపై మూతలు ఉంచుకోవాలన్నారు. ఇళ్లతో పాటు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈగలను ఇంటి పరిసరాల్లో లేకుండా ఫినాయిల్ లాంటివి చల్లుకోవాలన్నారు. ఇంట్లో ముందుగా అత్యవసర సమయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లును అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రవీంద్రనాయక్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి ముజీబ్, సీహెచ్‌వో సీతారామయ్య, హెడ్మాస్టర్ నజీమున్నిసా, హెల్త్ సూపర్‌వైజర్ నాగరాజ, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల నిర్మూలనకు కృషి చేయండి

పెద్దతిప్పసముద్రం: వర్షాకాలం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మెడికల్ అధికారి డాక్టర్ పురుషోత్తం నాయక్, డాక్టర్ యస్థాని సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలో పని చేసే ఆశా వర్కర్లతో వైద్య సిబ్బంది సమీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, దోమల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రతలు, ప్రధానంగా డయేరియాపై ప్రజలకు క్షుణంగా అవగాహన కల్పించాలని సూచించారు.

చిన్నారులను గుర్తించడానికి ఇంటింటి సర్వే



మాట్లాడుతున్న డాక్టర్ జవహర్‌బాబు

కలకడ : చిన్నారులను గుర్తించడానికి ఆరోగ్యసిబ్బంది ఇంటింటి సర్వేచేయాలని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశ డే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. డయేరియా మాసోత్సవాలలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో 0-5 సంవత్సరాల చిన్నారులు ఎక్కువగా అంగన్‌వాడీ కేంద్రంలో అందుబాటులో ఉంటారని గుర్తు చేశారు. అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి చిన్నారుల తల్లులకు ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేయడం, వినియోగించడంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ రాజమ్మ, సూపర్‌వైజర్‌లు వెంకటేశ్వరరావు, వాణి, లక్ష్మి, భాగ్యమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధితో ముందుకెళ్తాం

– మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న కంభం నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం: పీలేరు నియోజకవర్గంలో రాబోవు ఐదేళ్లలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధితో ముందుకెళ్తామని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ కమిటీ సమావేశ భవనంలో టీడీపీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు తాము అండగా ఉంటామన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకిపురంలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు క్రిష్టారెడ్డి, రాజేంద్రాచారి, చంద్రమౌళి, పివి నారాయణ, గాంధీపేట రమణ, ఆనంద, మురళి, ఫణీ, రమేష్, సయ్యద్‌బాష, రమణ, ఖలందర్, సైదు, యూసఫ్, చాను, టమేట రామచంద్ర, రియాజ్, రెడ్డెప్ప, ఆదినారాయణ, రెడ్డిరాం, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు కొనుగోలు చేస్తే బిల్లులు తప్పనిసరి



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ శివశంకర్

గుర్రంకొండ: ఎరువులు కొనుగోలు చేసే రైతులకు డీలర్లు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని మదనపల్లె ఏడీఏ శివశంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గుర్రంకొండలోని ఎరువుల దుకాణాల్లో, గోడౌన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా స్టాకు, పంపిణీ రిజిష్టర్లు తనిఖీ చేశారు. గోడౌన్లలో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. గోడౌన్లలలో విక్రయ అనుమతి లేని ఎరువులను సీజ్ చేశారు. అనంతరరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఎరువుల దుకాణం ఎదుట కచ్చితంగా ధరల పట్టిక ఉంచాలన్నారు. అందులో ఎరువుల ధరలు పొందుపరచాలన్నారు. రైతులు కొనుగోలు చేసే ప్రతి ఎరువులు, పురుగుల మందులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అనధికారిక గోడౌన్లు నిర్వహించినా, నకిలీ ఎరువులు విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకొంటామన్నారు. స్థానిక విజయ ఎరువుల దుకాణంలో 1985 ఎరువుల నియంత్రణా చట్టం నియమనిబంధనలకు అతిక్రమించిన ఎరువులను సీజ్ చేశామన్నారు. అమ్మకాలకు అనుమతిలేని రూ. 80,483 విలువ చేసే యూరియా బస్తాలను సీజ్ చేశామన్నారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు వాటి అమ్మకాలు జరపకూడదన్నారు. కార్యక్రమంలో ఏఈవో అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

అతిసార నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉషశ్రీ

పీలేరు రూరల్ : అతిసార నివారణపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని రేగళ్ల ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ×స్టాప్ డయారియా× కార్యక్రమం రెండు నెలల పాటు నిర్వహించాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లల మరణాలకు నీళ్ల విరేచనాలు ప్రధాన కారణమని తెలిపారు. ఈ విధంగా ప్రతి ఏటా దేశంలో 50 వేల మంది పిల్లలు మరణిస్తున్నారని చెప్పారు. లక్ష్యాన్ని సాధించడానికి ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వో, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలన్నారు. డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ శైలజ, సీహెచ్‌వో జయలక్ష్మీ, హెచ్‌ఈ ఉషారాణి, సూపర్‌వైజర్ రమాదేవి, చిన్నప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

అతిసార రోగులకు ఓఆర్ఎస్ ద్రావణం



ఓఆర్ఎస్ ద్రావణం నింపిన క్యాన్లు ఏర్పాటు చేస్తున్న సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు

మదనపల్లె : అతిసార (డయేరియా) రోగులపై స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఓఆర్ఎస్ ద్రావణం అందుబాటులోకి తెచ్చారు. మంగళవారం ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.ఎస్.రాజు వైద్యులు సిబ్బందితో కలిసి ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, అన్ని వార్డులలో ఓఆర్ఎస్ ద్రావణం నింపిన క్యాన్లు ఏర్పాటు చేశారు. డయేరియా కేసుల సంఖ్య పెరుగుతున్న కారణంగా, అతిసార రోగులతో పాటు, శరీరంలో ఎలక్ట్రోలైట్స్ స్థాయిలు తగ్గిన రోగులు ఓ ఆర్ ఎస్ ద్రావణాన్ని తీసుకునేందుకు వీలుగా క్యాన్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. డయేరియాతో ఆస్పత్రిలో చేరే రోగులకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాసులు, విష్ణువర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉంటూ పోరాడతామని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పలు సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, టీడీపీ నాయకులు చేస్తున్న దాడులు, అరాచకాలను అడ్డుకుని కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. అలాగే అభివృద్ధి, సంక్షేమం విషయాలలో పేదలకు అండగా ఉండి పోరాడతామని తెలిపారు. మొదలు పెట్టిన అభివృద్ధి పనులను టీడీపీ ప్రభుత్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలకు అన్ని వేళల అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, నాయకులు పంజం సుకుమార్‌రెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, సుధాకర్ రాజు, సీహెచ్ రమేష్, నందా బాల, రామక్రిష్ణ, రత్తయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట టౌన్ : రాజంపేట ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ ఐటీఐ ప్రిన్సిపల్ కె. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 24వ తేదీలోపే తమ సర్టిఫికెట్లను ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్న వారినే కౌన్సిలింగ్‌కు పిలవనున్నట్లు తెలిపారు. తమ ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో 116 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. అర్హులైన ఆసక్తిగల అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

గుంతలమయమైన రోడ్డుతో అవస్థలు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

కేవీపల్లె : కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో రోడ్డు మొత్తం గుంతలమయమై తీవ్ర అసౌకర్యంగా మారింది. పీలేరు - సుండుపల్లె మార్గంలోని కేవీపల్లె పంచాయతీ జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో తారు రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు వర్షపు నీరు తోడవడంతో అస్తవ్యస్తంగా మారింది. ఆ మార్గంలో వెళ్లడానికి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

టీచ్ టూల్‌తో మెరుగైన బోధన

- గుణాత్మక విద్య అభివృద్ధి దిశగా 9 రోజుల శిక్షణ
- రెండురోజుల్లో పూర్తిస్థాయిలో యూనిఫామ్స్, పుస్తకాల పంపిణీ
- డీఈఓ శివప్రకాష్‌రెడ్డి



యూనిఫామ్ పంపిణీ చేయాలని ఎంఈఓలను ఆదేశిస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

మదనపల్లె : మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి పర్చేందుకు, టీచ్ టూల్ ద్వారా ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను అధ్యయనం చేసేందుకు 9 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈఓ శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జెడ్పీహైస్కూల్‌లో రాష్ట్రప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెనింగ్, సమగ్ర శిక్ష ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో టీచ్ టూల్ పేరుతో మదనపల్లె డివిజన్‌లోని సీఆర్‌పీలు, ప్రైవేట్, హైస్కూల్ హెచ్‌ఎంలు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి పర్చేందుకు...అదే సమయంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఎస్‌సీఈఆర్‌టీ పలు రకాల పద్ధతులను అధ్యయనం చేస్తోందన్నారు. టీచింగ్ సామర్థ్యాలు ఎలా ఉన్నాయి ? టీచర్‌కు, విద్యార్థికి మధ్య సంబంధాన్ని తెలుసుకునేందుకు టీచ్ టూల్ అబ్జర్వేషన్స్ ఉపయోగపడుతాయన్నారు. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు ఎలా ఉన్నాయి ? విద్యార్థి స్థాయికి వెళ్లి బోధన చేస్తున్నారా? ఉపాధ్యాయుడి బోధనను విద్యార్థులు ఏ విధంగా రిసీవ్ చేసుకుంటున్నారు? ఉపాధ్యాయుడు బోధనలో 21వ శతాబ్దపు నైపుణ్యాలను అమలుచేస్తున్నారా?లేదా? తదితర విషయాలను టీచ్‌టూల్ ద్వారా సర్టిఫైడ్ అబ్జర్వర్స్ తరగతి గదుల్లో పరిశీలన చేస్తారన్నారు. గుణాత్మక విద్యను అభివృద్ధి చేసేందుకు శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. శిక్షణకు సంబంధించి మెటీరియల్‌తో పాటుగా వీడియోలు, గ్రూప్ డిస్కషన్స్ ద్వారా బోధనను మెరుగుపరిచే పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే మదనపల్లె డివిజన్‌లో 7,667 మంది పిల్లలకు బుధవారంలోపు యూనిఫామ్స్ పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పెండింగ్ ఉన్న పాఠ్యపుస్తకాలు మూడోవిడతలో చేరుకున్నాయని, రెండు రోజుల్లో పిల్లలకు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు తమకు రెండునెలలుగా వేతనాలు అందడం లేదని డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష సీఎంఓ కరుణాకర్, ఎంఈఓలు ప్రభాకరరెడ్డి, రాజగోపాల్, పద్మావతి, నారాయణ, హేమలత, ఆంజనేయులు, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఆర్.వి.రమణ, మహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ

కురబలకోట: డీఈఓ శివప్రకాష్ మంగళవారం కురబలకోటలో స్టూడెంట్స్ కిట్స్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పుస్తకాలను వెంటనే పాఠశాలలకు అందజేయాలన్నారు. అనంతరం పక్కనే ఉన్న జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఈ సారి పది ఫలితాల్లో కురబలకోట జెడ్పీ హైస్కూల్ మొదటి స్థానం సాధించడం పట్ల ఆయన ప్రశంసించారు. ఉత్తమ ఫలితాల సాధనకై ఇప్పటి నుండే తగిన ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు.

నీట్ పరీక్షను తక్షణమే రద్దుచేయాలి

- జూలై 4న విద్యా సంస్థల బంద్
- లీకులకు కారణమైన ఎన్‌టీఏను రద్దుకు డిమాండ్



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకుడు మాధవ్

మదనపల్లె : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని, నీట్ పరీక్షను కేంద్రప్రభుత్వం తక్షణమే రద్దుపరచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్ డిమాండ్ చేశారు. మంగళవారం బీటీ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ...జూలై 4న జరిగే దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌టీఏ తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాసాలతో, బాధ్యతారాహిత్యంతో నీట్ పరీక్షలు నిర్వహించిందన్నారు. నీట్ పరీక్ష లీకేజీ తెర వెనుక కుంభకోణం, నీట్ పీజీ పరీక్షను వాయిదా వేయడం, యూజీసీ నెట్ పరీక్ష రద్దుచేయడం లాంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించాయి. నీట్ స్కాంపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్యాపరిస్థితి దారుణంగా తయారైందన్నారు. దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా జూలై 4వతేదీన దేశవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ నిర్వహించాలని విద్యార్థిసంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చిందన్నారు. బంద్‌లో అన్ని విద్యార్థిసంఘాలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. నీట్ పరీక్ష విధానాన్ని రద్దుచేయాలని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అన్నమయ్యజిల్లా సహాయకార్యదర్శి లూయిసా, జిల్లా గర్ల్స్ కో కన్వీనర్ గంగారాణి, మదనపల్లె నియోజకవర్గ ఉపాధ్యక్షులు వినయ్, సుప్రజ, సోఫియా, కవిత, భరత్, అఖిల్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



డయేరియా నివారణ పోస్టర్లను ప్రదర్శిస్తున్న డాక్టర్ జులేఖ బేగం, వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించి డయేరియా వ్యాధిని తరిమికొట్టాలని మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి జులేఖ బేగం అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. అలాగే డయేరియా నివారణపై ముద్రించిన బ్యానర్లు, గోడపత్రికలను వైద్య సిబ్బందితో కలసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం జులేఖ బేగం మాట్లాడుతూ డయేరియా వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. డయేరియా సోకితే ప్రజలు అశ్రద్ధ చేయకుండా సమీప ఆసుపత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందేలా ప్రజలకు సూచించాలన్నారు. వైద్య సిబ్బంది ఇందిరా, సుధాకర్, మహమ్మద్ రఫీ, భానుబి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ వద్ద స్తంభిస్తున్న ట్రాఫిక్

- గంటల కొద్ది బారు తీరిన వాహనాలు
- పట్టించుకోని మార్కెట్, పోలీసు అధికారులు



మార్కెట్ వద్ద ఆగిపోయిన వాహనాలు

మదనపల్లె సిటీ: మదనపల్లె టమటా మార్కెట్ వద్ద ట్రాఫిక్ స్తంభించిపోతోంది. వందలాది టమటా ట్రాక్టర్లు,బోలేరో వాహనాలు మార్కెట్ నుంచి అమ్మచెరువుమిట్ట వరకు నిలిచిపోయాయి.దీంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారిపోయింది. సాయంత్రం అయితే చాలు వాహనాలు ఎక్కడిఎక్కడ ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మార్కెట్‌కు టమటా సరుకు ఎక్కువగా వస్తోంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి టమటా వస్తోంది. దీంతో వాహనాలు భారీ రావడంతో రోడ్లపైనే నిలిచిపోతున్నారు. మదనపల్లె పట్టణం నుంచి కదిరి,కడప వైపు వెళ్లే వాహనాలు, వచ్చే వాహనాలు పట్టణంలోకి రాలేకపోతున్నాయి. చౌడేశ్వరి సర్కిల్ వద్ద ఆగిపోతున్నాయి.ఈ విషయంపై మార్కెట్, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా టమాటా వాహనాలు నిర్ణీత సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా మార్కెట్‌లోకి పోయేలా చూడాలని కోరుతున్నారు.